క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో మూడు నెలల స్వల్పకాల ఉచిత శిక్షణకు పదో తరగతి, ఆపై అర్హత కలిగిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకులు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డి.రామకృష్ణను 99487 68778లో సంప్రదించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు, ఏయూ వాకర్స్ గ్రూప్ సభ్యులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ప్రాంగణంలో నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ వేసవి కాలంలో ఈ మార్గంలో వెళ్లే బాటసారులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు 1997లో చలివేంద్రం ప్రారంభించామని, అప్పటి నుంచి గత 28 సంవత్సరాలుగా ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో రోజూ తాగునీరు, ప్రతీ గురువారం మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ వాకర్స్ గ్రూప్ సభ్యులు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ సన్నిధిలో అన్నసమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ప్రతినిధులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో మహాశివరాత్రి మారువారాన్ని పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన చేశారు. దేవస్థానం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని బుజ్జి, దేవస్థానం సిబ్బంది సత్యనారాయణరాజు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరెడ్డి, మాజీ ధర్మకర్తలు గురుగోవింద్ సింగ్, మజ్జి వెంకట సత్యనారాయణ, చిట్టిబోయిన గంగరాజు, జి.గురునాథరెడ్డి, అల్లూరి రమేష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం సెక్షన్ 33 కేవీ పరిధిలో చేపడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. నరసింహనగర్, గ్రీన్‌పార్క్, బాలయ్య శాస్త్రి లే అవుట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేయించుకోవాలనుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081)లో నగదు చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!!







బృందావన్ పార్కులో వాకింగ్ ట్రాక్

- మురళీనగర్‌లో ఆధునిక వాకింగ్ ట్రాక్‌లు
- వాకింగ్‌తో ఆరోగ్యం మెరుగు పరచుకుంటున్న స్థానికులు
- అందుబాటులో వ్యాయామ పరికరాలు

మురళీనగర్ : నేటి ఉరుకుల పరుగుల జీవితంలో వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ కొరవడింది. రోజూ వ్యాయామం చేయలేనంత బిజీగా ఉన్నామంటూ కొందరు చెబుతూ ఉంటారు. నిజంగా వారికి అంత తీరిక లేకపోయినా ఉదయం, సాయంత్రం వేళల్లో ఏదో ఒక పూట కనీసం 45 నిమిషాలు నడిస్తే వారి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇందుకు అనువైన ప్రాంతాలు కూడా అవసరమే. దీంతో చాలా మంది రహదారులపై నడుస్తుంటారు. ఇవి హార్డ్ సర్ఫేస్‌లు కావడంతో కీళ్లకు సంబంధించిన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అంతేకాకుండా రహదారులపై నడక ప్రమాదాలను కొనితెస్తుంది. అలా కాకుండా వారికి సమీపంలోని పార్కులను ఆశ్రయిస్తే మంచి ఫలితం దక్కుతుంది. కాస్త బద్ధకం వదిలి ఇంటికి అతి సమీపంలో ఉన్న పార్కులకు వెళ్తే వాకింగు ట్రాకులు అందుబాటులో ఉంటాయి. మురళీనగర్‌లోని పార్కుల్లో అధునాతనమైన వాకింగు ట్రాకులు వాకర్స్ కోసం అందుబాటులో ఉన్నాయి. మట్టితో రూపొందిన ట్రాకులను వాకర్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించారు. రోడ్లపై నడిచి ప్రమాదాలు కొని తెచ్చుకునే కన్నా పార్కుల్లోని వాకింగ్ ట్రాకులను వినియోగించుకోవాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. మీరు ''నడవండి.... ఇతరులను నడిపించండి'' అంటూ పిలుపునిస్తున్నారు. మరెందుకు ఆలస్యం. వాకింగు ట్రాకులను ఎంచక్కా వినియోగించుకోండి.



వాకర్స్ పార్కులో పచ్చదనం మధ్య వాకింగ్ ట్రాక్

అందుబాటులో అధునాతన వాకింగ్ ట్రాక్‌లు

మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ ట్రాకు అత్యంత ఆధునికంగా నిర్మించారు. 250 మీటర్ల పొడవు కలిగిన ఈ ట్రాకును మట్టి, ఇటుక, క్రషర్ డస్టు, రంపపు పొట్టు, గ్రావెల్, ఇసుకతో రూపొందించారు. ఇందుకోసం రూ.6 లక్షలు ఖర్చు చేశారు. ఉదయం 5 నుంచి 10 గంటలు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు పార్కు తెరిచి ఉంటుంది. ఉచితంగా ఈ ట్రాకును వినియోగించుకోవచ్చు. ఒకేసారి పది మంది కలిసి నడిచే విధంగా దీన్ని రూపొందించారు. పార్కులో మ్యూజికల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వాకింగ్ చేసే వారు మధుర సంగీతాన్ని ఆస్వాదించవచ్చు. సంగీతం వినేందుకు ప్రత్యేకంగా సెల్ ఫోన్లు తీసురావాల్సిన అవసరం ఉండదు. మినరల్ వాటర్ సదుపాయం ఉంది. అంతే కాకుండా వాకింగు అనంతరం జిమ్ చేసుకోవడానికి పరికాలు అందుబాటులో ఉన్నాయి.

- మురళీనగర్ వాకర్స్ పార్కులో సిమెంట్‌తో నిర్మించిన వాకింగ్ ట్రాకు అందుబాటులో ఉంది. త్వరలో మట్టితో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. పార్కులోకి ప్రవేశించగానే ఆహ్లాదకరమైన సంగీతం వినిపించే విధంగా మ్యూజిక్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పిల్లలను ఆట పరికరాల వద్ద వదిలి పెద్దలు వాకింగ్ చేసుకోవచ్చు. పచ్చదనం మధ్య స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ ఆరోగ్యానికి ఆక్సిజన్ అనే టానిక్ తీసుకోవచ్చు. మినరల్ వాటర్ సదుపాయం ఏర్పాటు చేశారు.
- హరిత పార్కులో ఇటీవల రూ.19 లక్షలతో అభివృద్ధి పనుల నిర్వహణలో భాగంగా మట్టితో సాంకేతికంగా వాకింగ్ ట్రాకు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో సందర్శకులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడ పిల్లలు, పెద్దలకు అవసరమైన వ్యాయామ పరికరాలున్నాయి.
- సుదర్శన్ పార్కులో వాకింగ్ ట్రాకు సదుపాయం ఉంది. దీన్ని టైల్స్‌తో ఏర్పాటు చేశారు. చిన్నారులు ఎక్కువగా వస్తున్నందున వారు జారి పడిపోకుండా టైల్స్‌తో అందంగా తీర్చిదిద్దారు.
- బృందావన్ పార్కులో మట్టితో నిర్మించిన వాకింగ్ ట్రాకు అందుబాటులో ఉంది. దీనికి ఇరువైపులా అందమైన ఆక్సిజన్ మొక్కలను ఏర్పాటు చేయడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. ఇటీవల ఈ పార్కులో జిమ్ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు.
- ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ఇటీవలే వాకింగ్ ట్రాకును వాకర్స్‌కు అనుకూలంగా రూపొందించి అందుబాటులోకి తెచ్చారు. ఓపెన్ జిమ్ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

నడకతో ఎన్నో ప్రయోజనాలు



రోజూ కనీసం 30 నుంచి 45 నిమిషాలు నడవాలి. రోజులో పదివేల అడుగులైనా పడాలి. నడక వల్ల గుండె పని తీరు మెరుగుపడడంతోపాటు కండరాలకు రక్త ప్రసరణ జరుగుతుంది. మోకాళ్లపై ఒత్తిడి తగ్గడంతోపాటు ఆర్థరైటిస్ నివారణకు నడక ఉపయోగపడుతుంది. ఊబకాయాన్ని, అధిక బరువు సమస్యను అధిగమించవచ్చు. రోజంతా చురుగ్గా గడపడంతోపాటు నిద్ర సమస్యలు పోతాయి. సూర్యరశ్మి శరీరానికి తాకడం వల్ల ఎముకలు, కండరాలు బలంగా తయారవుతాయి.

– డాక్టర్ ఎల్.అప్పలనాయుడు, కార్డియాలజిస్టు

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై సీఎం స్పందించాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 157 రోజుల నుంచి ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, దీనిపై వెంటనే ముఖ్యమంత్రి స్పందించి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. దీక్షలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకోవాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సుమారు 40 వేల మంది ప్రస్తుత, రిటైర్డ్ పోర్టు, సీఐఎస్ఎఫ్, డీఎల్బీ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వారి చేతుల్లో పెట్టడం సరికాదన్నారు. పోర్టు వద్ద ఉన్న రిజర్వు నిధులతో ఆస్పత్రిని ఆధునికీకరించి నిర్వహించాలని కోరారు. అలా కాకుంటే తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో బి.జగన్, జె.సత్యనారాయణ, గణేష్, నాయుడు, రాజగోపాల్, కేఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



శ్రీనివాసనగర్ గెడ్డలో పేరుకుపోయన వ్యర్థాలు

సీతంపేట : నియోజకవర్గంలోని వార్డుల్లో గెడ్డల నిర్వహణ అధ్వానంగా మారింది. జీవీఎంసీ 43వ వార్డు 80 అడుగుల రోడ్‌లో గౌరీ కల్యాణ మండపం వెనుక శ్రీనివాసనగర్‌లో ఉన్న గెడ్డలో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. చెత్త, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ గెడ్డలో కుప్పగా నిలిచిపోయాయి. చాలా కాలంగా గెడ్డలో చెత్త తొలగించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గెడ్డల్లో పూడిక తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నందగిరినగర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నందగిరినగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు నందగిరినగర్ ప్రాంతంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి 160 కేవీ కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ వాడకం పెరగడంతో ప్రస్తుతం సరఫరా అందిస్తున్న 34 ఎస్ఎస్ ఫీడర్‌పై లోడ్ పడుతోంది. వేసవి కాలంలో ఈ సమస్య మరింత తీవ్రమై విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ట్రిప్ అవ్వడం జరుగుతోంది. దీంతో ఈ ప్రాంతంలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో రానున్న వేసవిలో నందగిరినగర్‌లో విద్యుత్ సరఫరాలో సమస్యలు తొలిగేలా ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న ఫీడర్‌పై లోడ్ రిలీఫ్ కోసం 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు ఏఈ అప్పలరాజు తెలిపారు. దీనివల్ల నందగిరినగర్‌లో 300 సర్వీసుల వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు.

ఆశీలమెట్టలో ట్రాఫిక్ కష్టాలు



ఆశీలమెట్ట – ద్వారకానగర్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులో గల ఆశీలమెట్టలో అడుగడుగునా ట్రాఫిక్ జామ్ అవుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, బ్యాంకులు, హోటళ్లు, పార్లర్లు, రెస్టారెంట్లు, ఫొటో ఫ్రేమ్‌వర్క్స్, జెరాక్స్ దుకాణాలు, స్టూడియోలు, లాడ్జిలు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో వేలాది మంది వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆశీలమెట్ట నుంచి ద్వారకానగర్ వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో జీవీఎంసీ జోన్ – 3 కార్యాలయం, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి ద్వారకానగర్ వెళ్లే మార్గంలో కూడా నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి తాజ్ హోటల్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు పెట్రోల్ బంక్ వైపు వెళ్లే మార్గంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవడంతో వాహనచోదకులు హారన్ల మోత మోగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో గల దుకాణాలు, లాడ్జిలు, హోటళ్ల ఎదుటనే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు, పాదచారులు వెళ్లడానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఈ మార్గంలో రోడ్ల మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జిపై వాహనాల పార్కింగ్‌తో అవస్థలు



శ్రీనివాసనగర్‌లో బ్రిడ్జిపై పార్కింగ్ చేసిన వాహనాలు

సీతంపేట : లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బాక్సు కల్వర్టులను కొంత మంది వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో బెల్లం రాములమ్మ వీధికి వెళ్లే మార్గంలో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఇటీవల బాక్సు కల్వర్టు నిర్మించారు. పాత కల్వర్టు చాలా ఏళ్ల కిందట నిర్మించడంతో, కింద భాగం గోడలు బలహీనం కావడంతో దాని స్థానంలో కొత్తగా బాక్సు కల్వర్టు నిర్మించారు. శ్రీనివాసనగర్ నుంచి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌కి రాకపోకలు సాగించడానికి ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఈ బ్రిడ్జి పైనుంచి వేలాది మంది వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ బ్రిడ్జిపై లగేజీ ఆటోలు, కార్లు పార్కింగ్ చేసి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కల్వర్టును పార్కింగ్ కేంద్రంగా వినియోగిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి బ్రిడ్జిపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు



అక్కయ్యపాలెం శాంతిపురంలో తరలించకుండా వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు పరిధి శాంతిపురంలోని పలు వీధుల్లో విద్యుత్ వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించి పది రోజులు గడుస్తున్నా తరలించలేదు. దీంతో ఇళ్ల ముందు చెట్ల కొమ్మలు ఎండిపోయి, ఆకులు గాలికి ఎగురుతూ రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. గతంలో చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే లారీల్లో తరలించే వారని, ప్రస్తుతం తరలింపు విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించిన వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెట్టు కొమ్మలు

కుప్పగా చెట్ల కొమ్మలు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ రోడ్డు పక్కనే చెట్ల కొమ్మలు పడి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడి భారీ వృక్షం పక్కనే చెట్ల కొమ్మలు కుప్పగా పడి ఉన్నాయి. ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ సిబ్బంది వారం రోజుల కిందట ఇక్కడ చెట్ల కొమ్మలు పడేశారని స్థానికులు అంటున్నారు. పోర్టు గేటు, ఎన్ఆర్ఐ ఆస్పత్రి మార్గంలో గల చెట్ల కొమ్మల కారణంగా వాహనాలు మలుపు తిరేగటప్పుడు ఇబ్బంది కలుగుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి వెంటనే చెట్ల కొమ్మలు తొలగించాలని, వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



ధర్నాలో హమాలీలు, ముఠా కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : పౌర సరఫరాల శాఖ హమాలీలను రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ పౌర సరఫరాల వ్యవస్థ ప్రారంభం నుంచి పని చేస్తున్నప్పటికీ హమాలీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హమాలీలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వారికి కనీసం వైద్యం కూడా లభించడం లేదన్నారు. వీరికి తక్షణమే ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. పీఎఫ్ ద్వారా చనిపోయిన వారి కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం అమలు చేసి, 60 సంవత్సరాల నుంచి కార్మికులందరికీ పీఎఫ్ సొమ్ము అందజేసి పెన్షన్ అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ, సీహెచ్ కాసుబాబు, సీహెచ్ గురుమూర్తి, హమాలీలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

జోన్ – 5లో నీళ్ల దొంగలు..!

- సొంత వ్యాపారాలకు జీవీఎంసీ నీరు
- ట్యాంకర్లతో రాత్రి వేళ దర్జాగా చోరీ
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ అధికారులు

విశాఖ విద్య : ఇప్పటి వరకూ సమాజంలో డబ్బులు దొంగలించే వారిని చూశాం.. వస్తువులు ఎత్తుకుపోయేవాళ్లనూ చూశాం.. కానీ కొందరు స్వార్థపరులు సొంత వ్యాపారాల కోసం రాత్రివేళల్లో తాగునీటిని దోచుకుపోతున్నారు. ఆశ్చర్యంగానే ఉన్నా ఇదే నిజం. నగరంలోని జోన్ – 5 పరిధిలో తాగునీటిని కొంతమంది తమ వ్యాపార అవసరాలకు దొంగచాటుగా ట్యాంకర్లతో దోచుకుపోతున్నారు. జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం గ్రీన్‌బెల్ట్ పార్కుకు ఎదురుగా గురువారం రాత్రి బయటపడిన వ్యవహారంతో ఇక్కడ నీళ్లతో వ్యాపారం ఏ రీతిన సాగుతుందో తేటతెల్లమైంది. ఎన్ఏడీ కేంద్రంగా హోటళ్లు నిర్వహించే కొంతమంది రాత్రి వేళ జీవీఎంసీ తాగునీటిని ట్యాంకర్లతో తరలించుకుపోతున్నారు. మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కులో ట్యాంకర్లకు తాగునీటిని నింపేందుకు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలో అవసరమైన చోట్లకు ట్యాంకర్లు ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకని 'ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్'ను ఇక్కడ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ ఉద్యాన వన విభాగం పర్యవేక్షణలో ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నిర్వహిస్తున్నారు. తాగునీటి అవసరాలతోపాటు, నగరంలోని రహదారి మధ్యలో ఉన్న ఉద్యానవనాలకు నీటిని ఇక్కడి నుంచి ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్నారు.



జీవీఎంసీ పైపుతో ట్యాంకర్‌లో నింపుతున్న నీరు

మామూళ్ల మత్తులో జీవీఎంసీ అధికారులు

మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కులో ఏర్పాటు చేసిన ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి రాత్రి వేళల్లో సమీపాన ఉన్న హోటళ్ల నిర్వాహకులు, మరికొంత మంది వ్యాపారులు తమ వ్యాపార అవసరాల కోసమని ట్యాంకర్లతో తాగునీటిని దోచుకుపోతున్నారు. ఇలా రోజూ రాత్రి వేళలో ఇక్కడ ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మర్రిపాలెంలో ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు చాలా కాలంగా ఇదే రీతిన ట్యాంకర్లతో జీవీఎంసీ తాగునీటిని తమ వ్యాపారాల కోసమని తరలిస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ కోసమని వెళ్తున్న వారు దీనిపై ప్రశ్నిస్తున్నా అధికారుల అండదండలతో నీటి తరలింపు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు నెల వారీ మామూళ్లు ముట్టజెపుతూ, ఇక్కడి వ్యాపారాలు ట్యాంకర్లతో ఇష్టానుసారంగా నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి చర్యలతో శివారు కాలనీల ప్రజానీకానికి తాగునీరు సవ్యంగా అందడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కు వద్ద జరుగుతోన్న 'నీటి వ్యాపారం'పై దృష్టి సారించి, అనుమతు లేకుండా ట్యాంకర్లుతో నీటిని దోచుకుపోతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి

నగర వాసులకు తాగునీరు సవ్యంగా సరఫరా చేసేందుకు ఆటంకాలు సృష్టిస్తున్న ఇలాంటి వ్యవహారాలపై జీవీఎంసీ అధికారులు తక్షణమే దృష్టి పెట్టాలి. ట్యాంకర్లు ద్వారా రాత్రి వేళల్లో తాగునీటిని తరలిస్తున్న వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవసరమైనంత తాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్